క్లుప్తంగా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న సీఐ శివగణేష్

కంబాలచెరువు: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ సీఐ పి.శివగణేష్ ఆధ్వర్యంలో హరిత న్యూరో హాస్పిటల్ సైకియాట్రిస్ట్ డాక్టర్ కార్తీక్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు సమాజంలో ఏ విధంగా ప్రవర్తించాలి, ఏ విధంగా బతకాలో వివరించారు. మంచి అలవాట్లను ఏ విధంగా అలవర్చుకోవాలో తెలిపారు. రౌడీషీటర్లు తమకు ఉన్న సమస్యలను డాక్టర్‌కు వివరించారు. ఆయన వారికి పరిష్కార మార్గాలను తెలిపారు. సీఐ శివగణేష్ మాట్లాడుతూ చెడు అలవాట్లను దూరం చేసుకుని ప్రజలకు ఉపయోగపడే విధంగా జీవించాలన్నారు.

అమరావతిలో నర్సరీల అభివృద్ధికి భూమి కేటాయించాలని వినతి



ఎమ్మెల్యే వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

కడియం: ఏపీ రాజధాని అమరావతి ప్రాంతంలో కడియం నర్సరీ రంగం అభివృద్ధి, బోటానికల్ గార్డెన్, ప్లాంట్ బయోడైవర్సిటీ కేంద్రం ఏర్పాటుకు 10 ఎకరాల భూమిని కేటాయించాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరిని సర్‌ఆర్థర్‌కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోడపాటి గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీ కొండేపూడి నాగు, సెక్రటరీ తాడాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోడిపందేలాడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం ఇటుక బట్టీల వద్ద కోడిపందేలాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని హెడ్‌కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. రఘుదేవపురం ఇటుక బట్టీల వద్ద దాడి చేసి కోడిపందేలాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,200, రెండు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

సెగపాట్లు

- ఎండలతో అల్లాడుతున్న జనం
- కరెంట్ కోతలతో మరిన్ని ఇబ్బందులు
- ఎక్కడికక్కడే చెట్ల నరికివేతతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



ఎండ కారణంగా నిర్మానుష్యంగా మారిన కంబాలచెరువు ప్రాంతం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): భానుడు సెగలు పుట్టిస్తున్నాడు.. ఉక్కపోతతో అల్లాడిస్తున్నాడు.. ఉదయం నుంచే తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజూ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు ఉన్నప్పటికీ గాలిలో తేమ శాతం 75 శాతం ఉండటంతో ఉక్కపోత ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. రాత్రి కూడా ఇదే ఉష్ణోగ్రతలు, తేమశాతం ఉండడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఏసీలు తిరుగుతున్నా కూల్ కావడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే అప్రకటిత కరెంట్ కోతలు అధికమయ్యాయి. కొద్ది రోజులుగా రాత్రిళ్లు విద్యుత్ కోతలతో రాజమహేంద్రవరంలోని పలు డివిజన్లలో ప్రజలు అల్లాడిపోయారు. అసలే ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు.. కరెంట్ కోత విధించడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. బుధ, గురు, శుక్రవారాల్లో నగరంలో కొన్ని ప్రాంతాల్లో కరెంట్ కోత విధించారు. వర్షం రాకపోయినా, కనీసం గాలి కూడా లేకపోయినా ఎందుకు విద్యుత్ ఎందుకు ఆపేస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేజేతులా మంట పెడుతూ..

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలంటూ వన మహోత్సవాన్ని కూటమి ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహిస్తోంది. అయితే నగరంలో ఎక్కడికక్కడే చెట్ల నరికివేతను అడ్డుకోలేకపోతోంది. అభివృద్ధి పేరుతో చాలాచోట్ల భారీ చెట్లనే తొలగించారు. విద్యుత్ తీగలకు చెట్లు కొమ్మలు తగులుతున్నాయని నగరపాలక సంస్థ సిబ్బంది చెట్లను నరికివేయడంతో ఎండ తీవ్రత పెరగడానికి ఒక కారణంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే ఎక్కడికక్కడే కాంక్రీట్ రోడ్ల కారణంగా భూమిలోకి వర్షపునీరు ఇంకే పరిస్థితి లేక అంతకంతకూ వేడి ఎక్కువవుతోంది.

రహదారులు..నిర్మానుష్యం

వ్యాపార కేంద్రంగా రాజమహేంద్రవరం విరాజిల్లుతోంది. అలాంటి జిల్లా కేంద్రం కొద్దిరోజులుగా మధ్యాహ్నం 12 గంటలకే నిర్మానుష్యంగా మారుతోంది. ఎంతో ముఖ్యమైన పని ఉంటే తప్ప ఎవరూ రోడ్లపైకి రావడం లేదు. రోడ్లన్నీ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఎండలకు చాలా చోట్ల వీధి వ్యాపారులు వ్యాపారాలను పక్కనబెట్టి ఇళ్లకే పరిమితం అవుతున్నారు. దీనివల్ల ఉపాధి కోల్పోతున్నామని అంటున్నారు. ఇదిలా ఉంటే ఇంకెన్ని రోజులు ఇలా ఉంటుందంటూ ప్రజలు నిట్టూర్పు వదులుతున్నారు.



మధ్యాహ్నం సమయంలో ఇలా..

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి



మొక్కలను తొలగించడమే ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణం. భూమిపై ఎక్కువగా కాంక్రీట్ భవనాలు, రహదారులు ఉండటం వల్ల వేడి పెరుగుతోంది. నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికమవుతోంది. ఇది మన ఆరోగ్యం, పర్యావరణంపై దుష్ప్రభావం చూపుతుంది.

–బి.మల్లేశ్వరావు, బోటనీ లెక్చరర్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భవిష్యత్తులో మరింత ఇబ్బంది



భవిష్యత్తులో మరింత ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. అధిక జనాభా కేంద్రీకరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వల్ల ప్రకృతి వనరుల వినియోగం అధికమవుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. వాహనాల నుంచి వెలువడే పొగ వాతావరణ కాలుష్యానికి కారణమవుతోంది. ఇది వాతావరణ మార్పులకు దారి తీస్తోంది.

– ఎం.కాశీవిశ్వనాథ్, జువాలజీ లెక్చరర్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనాలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి దత్తు

ధవళేశ్వరం: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సోదరుడు జక్కంపూడి చిన్ని ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం ధవళేశ్వరం స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు జక్కంపూడి చిన్ని తనయుడు దత్తు భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి దత్తు మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ సత్య దంపతులు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి నెలా 8వ తేదీన తన తండ్రి జక్కంపూడి చిన్ని పేరున మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని దత్తు తెలిపారు.

మహారోగి ఆరోగ్య కేంద్రంలో అన్నదానం

రాజమహేంద్రవరం రూరల్: వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో ఆదివారం మాజీ మంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు సోదరుడు జక్కంపూడి చిన్ని ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించారు. జక్కంపూడి చిన్న కోడలు శ్రావ్యదత్త, ఆయన కుమార్తెలు వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. జక్కంపూడి అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొన్నారని ముద్దాల అను తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ బృందాలు

రాజమహేంద్రవరం సిటీ: మాదక ద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు రాజమహేంద్రవరం ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పలు విభాగాలలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, టూటౌన్ పోలీస్ అధికారులు, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్‌తో మాదక ద్రవ్యాలపై సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. సుమారు 50 మంది అధికారులు, సిబ్బంది రైల్వే స్టేషన్‌లోని పాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాళ్లు, పార్శిల్ కార్యాలయం, క్లాక్ రూమ్‌లలో తనిఖీలు నిర్వహించారు.

ఘనంగా శ్రీ పుష్పయాగం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం రాత్రి శ్రీ పుష్పయాగం ఘనంగా జరిగింది. ఈ ఆలయంలో సీతారామచంద్రస్వామి వారి ప్రథమ సప్తాహాల్లో భాగంగా ఈనెల 5న భద్రకాళీ సమేత వీరభద్రేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఆ కల్యాణంలో భాగంగా శ్రీ పుష్పయగం నిర్వహించారు. ఆలయ అర్చకుడు కమలాకర్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

కరాటేలో పతకాల పరవళ్లు

- పలు విభాగాల్లో సత్తా చాటుతున్న క్రీడాకారులు
- బంగారు, వెండి పతకాలతో పాటు చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న వైనం



కరాటే పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ శ్రీ విద్య (ఫైల్)

ప్రకాశం నగర్ : ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా కొందరు నేర్చుకుంటున్న కరాటేలో సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు ఒంట బట్టించుకుంటున్నారు. ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటే విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించి పలు పతకాలు సాధిస్తున్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణలు వారిలోని ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు వారిని ఆపదలో ఆదుకునే విధంగా ఉంటాయని శిక్షకులు చెబుతున్నారు. ఐతే మిగిలిన క్రీడలతో పోలిస్తే కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడుకున్న ఈ విద్యల్లో రాణించడం అంత సులభం కాదు.

విజేతలు వీరే..

ఇటీవల్లే పాత తుంగపాడు గ్రామంలో జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే–కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో కాటస్, కుమిట్ విభాగంలో మోక్షత్, కె.లావణ్య రమ్య, దీక్షిత, పి.సహస్ర రేఖ, పి.నవ్య సూర్యతేజస్వీ, ఎస్.శ్రీ సహస్ర, వి.యశ్విని, బి.ఉషాందిని, బి.అంజలి, బి.అక్షర, ఎ.ప్రసన్న, పి.పూజ, జి.యశస్వి, జి.ధనస్వి, సిహెచ్.కొవింద్, జశ్వంత్,శశివర్ధన్, భవనేష్, అకిరా నందన్, టి.సంతోష్, కుషల్ శివ, ప్రవీణ్, శ్రీగణేష్, వికాస్ నారాయణ, హర్షవర్ధన్ సాయి, శరత్, వంశీ, శేషంత్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. చాంపియన్ షిప్‌లో బాలికల విభాగంలో ఎస్.శ్రీలక్ష్మీలత మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించగా, లక్ష్మీ భవానీ వెండి పతకంతో పాటు ట్రోఫీని గెలుచుకుంది. చాంపియన్ షిప్ బాలురు విభాగంలో పి.వెంకట చరణ్ బంగారు పతకం సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. విజేతలను ఈస్ట్ జోన్ డీఎస్పీ శ్రీ విద్య అభినందించారు.

అసక్తి పెరిగింది



గతంతో పోలిస్తే ప్రసుత్తం కరాటే విద్యను అభ్యసించేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రసుత్తం శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించవచ్చు.

– పిల్లి అరుణ్‌కుమార్, కరాటే మాస్టర్

చట్టాలు వీరికి చుట్టాలు



తూర్పుగానుగూడెం ఊర చెరువులో మట్టిని యంత్రాలతో తవ్వుతున్న దృశ్యం



సీతానగరం ర్యాంపులో ఇసుకను యంత్రాలతో వాహనాల్లోకి లోడు చేస్తున్న దృశ్యం

- అడ్డు అదుపూ లేని ఇసుక, మట్టి తవ్వకాలు
- స్పందించని అధికారులు

రాజానగరం: చట్టాలు వీరికి చుట్టాలు. ఎవరికి కావలసిన మేరకు వారు గోదావరిలో ఇసుకను, చెరువులలో మట్టి, కాలువ గట్లను, కొండలను యంత్రాలను ఉపయోగించి మరీ తవ్వేసుకోవచ్చు. లారీలలో యథేచ్ఛగా రవాణా చేసుకుని జేబులు నింపుకోవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది కాలంగా జరుగుతున్న తంతే ఇదే. అయినా అడ్డుకునే అధికారులు లేరు. అక్కడక్కడా ప్రతిపక్షానికి చెందిన వ్యక్తులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, అక్రమార్కులకు అధికార పార్టీ పెద్దల సాయంతో ఉండటంతో ఎటువంటి ఫలితాన్ని ఇవ్వడం లేదు. దీనితో నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా ఆడింది ఆట, పాడింది పాటగా సాగిపోతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పుంత రోడ్లు, పక్కా రోడ్లు అనే భేదం చూపకుండా వందలాది లారీలలో అక్రమ రవాణా సాగిస్తూ దీపం (అధికారం) ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే పనిలో కూటమి నేతలు నిమగ్నమై ఉన్నారు.



లారీలలో దూర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

కాసుల వర్షం కురిపిస్తున్న గోదావరి ఇసుక

సీతానగరం మండలంలోని గోదావరి ఇసుక, కోరుకొండ, రాజానగరం మండలాల్లోని ఎర్రమట్టి అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది లారీలలో ఇసుక, మట్టి రవాణా అవుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో రోడ్లు పాడైపోయి, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయినా అక్రమార్కులకు ప్రజల సమస్యలు పట్టడం లేదు. అక్రమ సంపాదనే ముఖ్యంగా దోపిడీనీ కొనసాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల మేరకు గోదావరిలో ఇసుకను నిర్మాణ పనుల కోసం ఉచితంగా అందించవలసి ఉంది. ఇందుకుగాను లబ్ధిదారులు ఆయా పంచాయతీల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను తీసుకువస్తే ర్యాంప్‌లలో ట్రాక్టరులో ఇసుకను లోడు చేస్తారు. సీతానగరం మండలంలో అధికార మద్దతు ఉన్న పెద్దలు సొంతంగా ర్యాంప్‌లను ఏర్పాటు చేసుకుని మరీ గోదావరిలో ఇసుకను తోడేస్తున్నారు. ముగ్గళ్ల, రఘుదేవపురం, బొబ్బిల్లంక, సీతానగరం, సింగవరం, వంగలపూడి, వెంకటనగరం, కాతేరు ప్రాంతాలలో ఇటువంటి ర్యాంప్‌లను చూడవచ్చు.

వీరికి నిబంధనలతో పనిలేదు

వేసవి తీవ్రత తగ్గి, వర్షాలు రానున్న ప్రస్తుత సమయంలో పర్యావరణం, అటవీ శాఖల నిబంధనల ప్రకారం నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి. కానీ సీతానగరం మండలంలో అటువంటి ఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు ఉండటంతో అక్రమార్కులు వాటిలో ఏదో ఒక పార్టీ జెండాను పట్టుకుని, తమ అజెండాను సాఫీగా అమలు చేసుకుపోతున్నారు. జెండా పట్టుకుని జై కొడితే చాలు వారు నిజానికి ఎవరనే విషయాన్ని కూడా చూడకుండా ఆయా పార్టీల పెద్దలు వీరి అక్రమార్జనకు అండగా నిలబడుతున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో గోదావరి ఇసుక, కొండలు, చెరువులలో మట్టి తవ్వకాలు, అమ్మకాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మండలంలోని తూర్పుగానుగూడెంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఊరచెరువులో మట్టిని గత నాలుగు రోజులుగా యంత్రాల సాయంతో తవ్వి, దూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ప్రజాప్రయోజనాల పేరుతో సాగుతున్న ఈ దోపిడీపై మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా అక్రమ తవ్వకాలు ఆగలేదు. నియోజకవర్గంలో మట్టి మాఫియా సాగిస్తున్న దందాకు ఇంతకంటే నిదర్శనం మరోటి లేదు.

–గంగిశెట్టి సోమేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, పాలచర్ల

మాయమవుతున్న కొండలు, భయపెడుతున్న చెరువులు

మట్టి మాఫియా సాగిస్తున్న అక్రమ తవ్వకాలతో నియోజకవర్గంలో రాజానగరం, కోరుకొండ మండలాలలో ఉన్న కొండలు చాలా వరకు మాయమైపోయాయి. కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, కొత్తతుంగపాడు, కోటికేశవరం – నల్లగొండ, శ్రీరంగపట్నం – మునగాల, రాఘవాపురం, కాటవరం, పరిసరాలలో ఈ ఎర్రమట్టి కొండలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వీటి ఆనవాళ్లు క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు కానవస్తున్నాయి. చివరకు కనుపూరులోని దేవుని కొండను కూడా వదలలేదు. యంత్రాల సాయంతో కొండలను పిండి చేసి, సొమ్ము చేసుకున్న వ్యక్తులు ఎర్రమట్టితో కూడిన చెరువులపై దృష్టి పెట్టారు.

నర్సరీలకు ఎర్రమట్టి ఉపయోగపడుతున్న నేపథ్యంలో దీనికి మంచి డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను తమకు అనుకూలంగా వినియోగించుకుంటూ చెరువులలో ఎర్రమట్టిని తోడేసి, అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో చెరువుల గర్భం లోతై, రాబోయే రోజులలో ఎటువంటి ప్రమాదాలకు తావిస్తుందోనని స్థానికులు భయపడుతున్నారు.

శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రకు ఘన స్వాగతం



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పుగోదావరి జిల్లాలో శ్రీ సత్య సాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రకు రెండవ రోజు భక్తులు ఘన స్వాగతం పలికారని శ్రీ సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం రాజమహేంద్రవరంలో కోలమూరు, కొంతమూరు, విద్యానగర్, శ్రీరామ్నగర్, హౌసింగ్ బోర్డ్, ఏ.వీ. అప్పారావు రోడ్డు, దానవాయిపేట, రామకృష్ణనగర్, శంభూనగర్, ఇన్నీసుపేట, ఆల్కాట్ గార్డెన్ వరకు నిర్వహించిన రథయాత్రకు ఘన స్వాగతం పలికారన్నారు. ప్రతిచోటా పూర్ణ కలశం, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, శ్రీ సత్యసాయి నామస్మరణ, బాబా సూక్తులు నినాదాలతో శ్రీ సత్య సాయి స్వయంగా తమ ప్రాంతానికి వచ్చారనే భక్తి, విశ్వాసాలతో జయజయ ధ్వానాలు చేశారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారతదేశంలో ఐదు ప్రాంతాలలో రథయాత్రలు చేస్తున్నారని, మన జిల్లాలో రెండవ రోజు ఘనంగా రథయాత్ర పూర్తి అయిందని చెప్పారు. అందర్నీ ప్రేమించు, అందరినీ సేవించు అనే సత్య సాయి ఆశయం, ప్రేమ, ఐక్యత భక్తుల్లో అభివృద్ధి చెందాలనే ధ్యేయంతో ఈ రథయాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం జోనల్ టు కొవ్వూరు, తాళ్లపూడి, గోపాలపురం, యాదవోలు, నల్లజర్ల, చాగల్లు నిడదవోలు, వేలివెన్ను మండలాలలో ఈ రథయాత్ర జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలలో రాజమహేంద్రవరం గురుకులం కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్, జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎన్వీ సాయిరాం, యువజన విభాగ సమన్వయకర్త ఎస్.సాయి సుధాకర్, పర్తి సేవల ఇన్‌చార్జి టీ.గోవిందరాజులు, విద్యా విభాగ సమన్వయకర్తలు ఎల్.శ్రీనివాసరాజు, ఎం. సాయి నిహారిక, భజనల విభాగ సమన్వయకర్త వి. సుభాష్, జోనల్ కన్వీనర్లు త్రిమూర్తులు, విజయసాయి, సబ్ జోన్ కన్వీనర్లు సాయిబాబా, మర్రెడ్డివీర్రాజు, కే. సుబ్రహ్మణ్యం సేవాసమితి కన్వీనర్లు , మాజీ కార్పొరేటర్ సీహెచ్ సత్యవాణి పాల్గొన్నారు.

వేడుకగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పున ప్రతిష్ఠ



ఆలయ పున ప్రతిష్ఠ నిర్వహిస్తున్న పండితులు

కోరుకొండ: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ ఆదివారం వేడుకగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ జరిగిన స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామి వారి నూతన విగ్రహం, శిఖరం, ధ్వజమయూర, సర్పబంధ పున ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. పండితులు పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు, ఆగమ పండితులు ఇంద్రగంటి విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

భారీ అన్న సమారాధన

స్వామివారి ఆలయ పునప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. కోరుకొండ, కాపవరం, జంభూపట్నం, శ్రీరంగపట్నం గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

స్వామివారిని దర్శించుకున్న జక్కంపూడి రాజా

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరినీ కాచి కాపాడాలని కోరి ప్రార్థించారు. రైతులకు పంటలు బాగా పండేలా, వ్యవసాయాలు లాభదాయకంగా సాగేలా చూడాలని కోరుకున్నారు. ఆయన వెంట పార్టీ యువజన విభాగరం జిల్లా కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు, ఆలయానికి ధ్వజ స్తంభం దాత, పారిశ్రామిక వేత్త మాగంటి శ్రీనివాసరావు, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఆలయ చైర్మన్ ఉల్లి బుజ్జిబాబు, వైస్ చైర్మన్ బదిరెడ్డి దొర, సెక్రటరీ తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, సభ్యులు నీరుకొండ బాబ్జి, ఉల్లి కాశీ పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా